క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును బాధితుడికి అందిస్తున్న నాగేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఆవుల భరత్‌కు శనివారం సీఎంఆర్‌ఎఫ్ రూ.1.40 లక్షల చెక్కును జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆవుల రాజా కుమారుడు భరత్ నాలుగు నెలల కిందట ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. చికిత్స నిమిత్తం డబ్బు ఖర్చయిందని ఈ విషయం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీఎంఆర్‌ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ.1.40 లక్షల చెక్కును మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

రోడ్లపై మద్యం తాగితే కేసులే



రాజుపాళెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాజగోపాల్

రాజుపాళెం : రోడ్లు, ఎక్కడపడితే అక్కడ మద్యం తాగొద్దని రాజుపాళెం ఎస్‌ఐ రాజగోపాల్ రాజుపాళెంలోని ప్రధాన రహదారి వద్ద శనివారం రాత్రి వాహనదారులకు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మద్యం తాగి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. వాహనదారుడు మద్యం తాగి వాహనాలను నడపటంతోనే ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు ఫోన్ చేసి మీ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వచ్చిందని చెప్పాలని అడిగితే చెప్పొద్దని సూచించారు.

బైక్ సైలెన్సర్లను మార్చితే సీజ్ చేస్తాం



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ సూచనతో బైక్ సైలెన్సర్లను తొలగిస్తున్న యువకులు

ప్రొద్దుటూరు క్రైం : కంపెనీ సైలెన్సర్లను తొలగించి అధిక సౌండ్‌తో కూడిన అసెంబుల్డ్ సైలెన్సర్లను బైక్‌లకు అమర్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అధిక శబ్దంతో కూడిన సైలెన్సర్లను అమర్చినా, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించిన వాహనాలకు సీఐ జరిమానాలు రాశారు. పలు బైక్‌ల సైలెన్సర్లను ట్రాఫిక్ సీఐ తొలగించి యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

కాలేజికి గేట్ పుస్తకాలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజికి పూర్వ విద్యార్థి సోము నవీన్‌కుమార్ శనివారం రూ.20వేలు విలువ చేసే గేట్ పుస్తకాలను వితరణగా ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజుకు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2016–20 సంవత్సరాల్లో కళాశాలలో నవీన్‌కుమార్ సివిల్ ఇంజనీరింగ్ చదివాడన్నారు. ప్రస్తుతం ఈ విద్యార్థి హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారన్నారు. ప్రస్తుతం గేట్ పరీక్షలకు సిద్ధమవుతున్న సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే రూ.20వేలు విలువ చేసే గేట్ పుస్తకాలను వితరణగా అందించారన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం



చాపాడు : పల్లవోలులో వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



బద్వేలు అర్బన్ : రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



రాజుపాళెం: కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

చాపాడు : గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వైద్యం కోసం వచ్చే ప్రజలందరికీ పరీక్షలు నిర్వహించి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇదే క్రమంలో వైద్యం చేయించుకునేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాలు, వాటి వలన చేకూరే లబ్ధిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యం చేయించుకున్న రోగులకు మందుల కిట్‌లను పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరం క్యాంపు వద్ద ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇదే క్రమంలో గ్రామంలోని పలువురు గర్భవతులకు సీమంతాలు చేయగా వారిని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. చిన్న పిల్లలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్న ప్రాసన కార్యక్రమం చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, జేసీఎస్ కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య, మనోహర్, సీవీ సుబ్బారెడ్డి, జయసుబ్బారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ యామిని, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి రాణి, వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, ఎంపీహెచ్‌ఈఓ రాఘవయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే జగనన్న ధ్యేయం

అట్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టరు సుధా పేర్కొన్నారు. మండల పరిధిలోని కుంభగిరి పంచాయతీ పరిధిలోని ఎస్ వెంకటాపురం కాలనీలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా నిర్వహిస్తున్న వైద్యపరీక్షలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి అవసరమైన మందులు జబ్బు నయం అయ్యేంతవరకూ ప్రభుత్వం అందిస్తుందన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కారకర్తలు ఏర్పాటు చేసిన బాలామృతం రచి చూసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు మల్లికార్జునరెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గంగయ్య, సర్పంచ్ గంగమ్మ, తహసీల్దారు వెంకటరమణమ్మ, ఎంపీడీఓ సుజాతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

బద్వేలు అర్బన్ : ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని వీరప్పల్లె సచివాలయంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఉన్నత ఆశయంతో జగనన్న వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, అందులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులను నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడం, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం వంటి కార్యక్రమాలను తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడపాటిరామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, సర్పంచ్‌లు జయసుబ్బారెడ్డి, అనూష, సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాష, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు వరం

రాజుపాళెం : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని ఏరువపాళెంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ వైద్యం మీకు ఎవరు చేయిస్తున్నారని ఆయన ప్రజలను అడుగగా జగన్ చేయిస్తున్నాడని చెప్పడంతో అందరూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే కంటి చూపును పరీక్షించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, సర్పంచులు సంధ్య, గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుద్దేటి రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, జగదీశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, తహసీల్దార్ ఇందిరారాణి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, కార్యదర్శి విజయమ్మ, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని సోమాపురం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుగుణ

బి.కోడూరు : బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ సుగుణ తెలిపారు. శనివారం మండలంలోని ప్రభలవీడు సచివాలయంలో సర్పంచ్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించడంతో పాటు బాల్యవివాహాల వలన ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, నష్టాల గురించి వివరించారు. ఎవరైనా పిల్లలను పోషణ భారమైనప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే చైల్డ్‌హోమ్‌ల ద్వారా వారిని పరిరక్షించి అనంతరం వివాహం చేసే బాధ్యత చైల్డ్‌హోమ్‌లే తీసుకుంటాయని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ చేసిన అభివృద్ధిని ఇంటింటికి వివరించాలి



గోపవరం : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

గోపవరం : గడిచిన నాలుగున్నర ఏళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గడప గడపకు వెళ్ళి వివరించడంతో పాటు గతంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు గురించి ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఎందుకు ఆంధ్రాకు జగనన్న కావాలి కార్యక్రమానికి సంబంధించిన శనివారం సాయంత్రం మండలంలోని శ్రీనివాసపురంలోని వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు కామిరెడ్డి సుధాకర్‌రెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందాయని తెలిపారు. అర్హులందరికి ఇళ్ళ స్థలాలను మంజూరు చేసి ప్రభుత్వమే ఆ ఇళ్ళను నిర్మించి ఇస్తున్నట్లు వారు తెలిపారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వెళ్ళి వృద్ధాప్య పింఛన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నందున ఆ కార్యక్రమం పూర్తయిన వెంటనే అన్ని సచివాలయాల పరిధిలో ఎందుకు ఆంధ్రకు జగనన్న కావాలి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున నిరంతరం ప్రజలతోనే సత్సంబంధాలు పెట్టుకుని జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు రాజేశ్వరి, సరస్వతమ్మ, సర్పంచ్‌లు రాధాకృష్ణారెడ్డి, వెంకటలక్షుమ్మ, పార్టీ నాయకులు శ్రీరాములు, హరికృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, మల్లేష్, సుబ్బారెడ్డి, శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిగా ఉట్టి శ్రీనివాసులు

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండలానికి చెందిన ఉట్టి శ్రీనివాసులును బద్వేలు, మైదుకూరు అసెంబ్లీల బీజేపీ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ నాయకులు శనివారం ఆయనకు నియామకపత్రం పంపించారు. గతంలో శ్రీనివాసులు కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, బద్వేలు కన్వీనర్‌గా పని చేశారు. ఇప్పుడు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయనకు రెండు అసెంబ్లీల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం పట్ల శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు.

పరామర్శ

చాపాడు : మండలంలోని చియ్యపాడు–2 మాజీ ఎంపీటీసీ దాసరి మహేష్‌యాదవ్‌ను శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. గుంతచీపాడు గ్రామానికి చెందిన మహేష్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి.. మహేష్ యాదవ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈయనతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ప్రభలవీడు గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి గుర్తించిన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. శిబిరంలో 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దారు విద్యాసాగర్, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళా

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో సింక్రేస్ కన్సల్టింగ్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 70 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



అల్లాడుపల్లెలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

చాపాడు : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామ సర్పంచ్ కిశోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గ్రామంలోని దళిత వాడ, బీసీ కాలనీ, గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలను, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చర్చికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని, దళిత వాడలో విద్యుత్ స్తంభాలు లేక తీగలు వేలాడుతున్నాయని, సమస్యలను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ఇసుక నాలుగు ట్రాక్టర్లు ఉచితంగా అందిస్తామన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ యామిని, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ ఏఈ ఈశ్వరయ్య, వీఆర్‌ఓ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసులరెడ్డి, రాజేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, జయసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, జయరాజు, బండి పుల్లయ్య, గంగులయ్య, గొడుగు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

మైదుకూరు : పట్టణంలోని ఐదో వార్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. స్థానిక బద్వేలు రోడ్డులోని వాసవి నగర్ వెనుక వైపున మురికి నీటి సమస్యను తొలగించేందుకు పది లక్షల రూపాయలతో డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పనులకు భూమి పూజ నిర్వహించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మురికి నీటి సమస్య ఎక్కడున్నా దానిని పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, ఐదో వార్డు ఇన్‌చార్జి జమాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, వార్డు నాయకులు వీరభద్రుడు, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, ఏఈ నిరంజన్ రెడ్డి, పిల్లి నాగయ్య, సొద్దల సురేష్, షాషా తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి




మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్మోన్ మాట్లాడుతూ కార్మికులకు నెలకోసారి చీపుర్లు అందిస్తున్నారని, రెండు సార్లు ఇవ్వాలని, తోపుడు బండ్లు పూర్తిగా పాడై పోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటిని కొత్తవి తెప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

437 మందికి వైద్య సేవలు



పోరుమామిళ్ల: నాగలకుంట్లలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



తెల్లపాడులో రోగులకు టోకెన్ ఇస్తున్న అధికారులు

పోరుమామిళ్ల : మండలంలోని నాగలకుంట్ల సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 437 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. డాక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, సందీప్, వైద్యాధికారులు శ్రీవిద్య, మేరీ ఎలీషాలు వైద్య సిబ్బందితో పాల్గొని రోగులకు పరీక్షలు చేశారు. శిబిరంలో 85 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, మండల అధికారులు, సర్పంచు, సంచర్ల పంచాయతీలోని రామేశ్వరం, బూరగమానుపల్లె, నాగలకుంట్ల గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు. ప్రత్యేక వైద్యులే తమ గ్రామాలకు వచ్చి పరీక్షలు చేసి, మందులు ఇవ్వడం పట్ల రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తెల్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషలాఫీసర్ మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదపాలిట పెన్నిధి అయిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన ప్రతి ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా ఇంటింటి సర్వే ద్వారా అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించి వైద్యశిబిరాలు నిర్వహించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. శిబిరంలో 432 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరుగురికి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రవేటీకరణ బిల్లును తీసుకువచ్చి విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే దుస్సాహసానికి ఒడిగట్టిందన్నారు. ఈ సమస్యలపై దశల వారి పోరా టాల్లో భాగంగా ఈనెల 9 నుండి 15 వరకు జిల్లాలో సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న సిద్ధవటం రేంజ్ అధికారి

అట్లూరు : ప్లాస్టిక్ వ్యర్థాలతలో మానవాళితో పాటు వన్యప్రాణులకు ప్రమాదం తప్పదని సిద్ధవటం రేంజ్ అధికారి కళావతి పేర్కొన్నారు. వన్య ప్రాణుల వారోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారికి ఇరువైపులా అటవీ ప్రాంతంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం తొలగించిన వ్యర్థాలతో జంతువులకు కలిగే అనర్థాలపై అటవీ చెక్‌పోస్టు సమీపాన వలంటీర్ల సహకారంతో విద్యార్థులకు వివరించారు. అటవీ ప్రాంతం మీదుగా వాహనాలలో ప్రయాణించే వారు వ్యర్థాలను అటవీ ప్రాంతంలో వేయకూడదన్నారు. అలాంటి వ్యర్థాలను తిని అడవి జంతువులు అనారోగ్యానికి గురవుతాయన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, బీట్ ఆఫీసర్లు మౌనికా, విశ్వనాథరెడ్డి, దీపికా, సుబ్బారామిరెడ్డి, ఏబీఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవలకుంట్లలో వన్యప్రాణుల వారోత్సవాలు

పోరుమామిళ్ల : మండలంలోని కవలకుంట్ల ఎంపీపీ పాఠశాలలో శనివారం వన్యప్రాణుల వారోత్సవాలు పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రామలక్షుమ్మ, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రత్నస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రత్నస్వామి మాట్లాడుతూ అడవికి నిప్పు పెట్టడం వన్యప్రాణులతో పాటు సర్వ మానవాళికి నష్టమన్నారు. అడవులను రక్షించుకోవడం అందరి బాధ్యతన్నారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎంఈఓ రత్నస్వామి అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ, బీటు అధికారులు కరుణాకర్, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా ...!

బద్వేలు అర్బన్ : నిత్యం వాహనాల్లో ఏదో ఒక రూపంలో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నా కొంత మంది ప్రజలు మాత్రం జాగ్రత్తలు పాటించడం లేదు. ఎవరికి ఏమైతే మాకేం, మా పని జరిగితే చాలు అనే రీతిలో పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో పెయింటింగ్ పనులకు ఉపయోగించే పెద్ద ఇనుప కుర్చీని వెనుక కూర్చున్న వ్యక్తితో తీసుకెళుతున్న దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న ఇటువంటి వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ప్రమాదకర రీతిలో ఇనుప స్టాండ్‌ను తరలిస్తున్న దృశ్యం